

తమ్ముళ్ల దాష్టీకం!

చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు గ్రామంలో ఓ రైతుపై టీడీపీ నేతలు దౌర్జన్యానికి దిగారు. పట్టా భూమిలో బాట వేసేశారు. - 8లో



శాంతిభద్రతల రక్షణే లక్ష్యం

పద్మావతి వర్సిటీలో సావేరి హాల్‌లో శనివారం నెలవారీ క్రైమ్ సమీక్షను ఎస్పీ సుబ్బరాయుడు నిర్వహించారు. - 8లో



సామాన్య భక్తులకే ప్రాధాన్యం

వైకుంఠ ద్వార దర్శనానికి సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నట్లు టీటీడీ ఈఓ శ్యామల రావు తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

ఖాతాదారులకు మెరుగైన సేవలు



శిలాఫలకం ఆవిష్కరణలో శ్రీనివాసులుశెట్టి

తిరుపతి అర్బన్ : ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని బ్యాంకు చైర్మన్ చల్లా శ్రీనివాసులు శెట్టి తెలిపారు. శనివారం తిరుపతిలోని లీలామహల్ సర్కిల్–మంగళం రోడ్డు మార్గంలో ఎస్‌బీఐ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్ కొత్త ప్రాంగణానికి భూమి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ తిరుపతి ప్రాంతం అభివృద్ధికి తమ వంతు అండగా నిలుస్తామని చెప్పారు. ఎస్‌బీఐ ప్రాజెక్టును మరింత విస్తరించడంతోపాటు ఖాతాదారులకు రుణ సౌకర్యం కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. ఈ క్రమంలోనే స్విమ్స్ ఆస్పత్రికి రూ.37.1లక్షల విలువైన పరికరాలు, ఎస్‌వీఐఎంఎస్ హాస్పటల్‌కు రూ.1.16 కోట్లు విలువైన వైద్య పరికరాలు అందించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్ రాజేష్ కుమార్ పటేల్, జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ జి.లేఖా మీనన్ పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే పరేడ్‌కు శ్రీకాళహస్తి విద్యార్థి



గిల్‌క్రిస్ట్

శ్రీకాళహస్తి: ఢిల్లీలో నిర్వహించే రిపబ్లిక్ డే పరేడ్‌కు శ్రీకాళహస్తిలోని ఎస్వీఏ ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి టి.గిల్ క్రిస్ట్ ఎంపికైనట్లు ప్రిన్సిపల్ నరసింహా వర్మ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన జాతీయస్థాయి వేడుకలకు తమ విద్యార్థి హాజరవుతున్నందుకు ఆనందంగా ఉందని వెల్లడించారు. ఈ క్రమంలో విద్యార్థికి అభినందనలు తెలిపారు. అధ్యాపకులు బాపనయ్య, గంగారామ్, సత్యనారాయణరెడ్డి, సాయి వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ బిల్లు చెల్లింపునకు అవకాశం

చిత్తూరు కార్పొరేషన్: విద్యుత్ బిల్లులు ఆదివారం సైతం చెల్లించవచ్చని తిరుపతి, చిత్తూరు జిల్లాల ట్రాన్స్‌కో ఎస్ఈలు సురేంద్ర నాయుడు, ఇస్మాయిల్‌అహ్మద్ శనివారం తెలిపారు. సెలవురోజు అయినప్పటికీ రెండు జిల్లాల్లోని బిల్లుల చెల్లింపుల కేంద్రాలు పనిచేస్తాయన్నారు. హెచ్‌టీ వినియోగదారులు 30వ తేదీలోపు బకాయిలు చెల్లించాలని సూచించారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించి, సంస్థకు సహకరించాలని కోరారు.

ఆక్రమణలపై ఆవేదన



అర్జీలు పరిశీలిస్తున్న అధికారులు

తిరుపతి అర్బన్ : తిరుపతిలోని చెన్నాయగుంటలో యథేచ్ఛగా భూ ఆక్రమణలు సాగుతున్నాయని, అధికారులు స్పందించి కబ్జాలను అరికట్టాలని స్థానికులు కోరారు. శనివారం ఈ మేరకు నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర రోజ్‌మాండ్, తహసీల్దార్ భాగ్యలక్ష్మికి వినతిపత్రాలు సమర్పించారు. ఈ క్రమంలో స్థానికులు మాట్లాడుతూ గ్రామ దేవత అక్కగార్లకు చెందిన భూమి సైతం ఆక్రమణకు గురవుతోందన్నారు. దీనిపై అధికారులు స్పందిస్తూ కబ్జాలకు అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపడతామన్నారు. రెవెన్యూ సదస్సులో మొత్తం 49 అర్జీలు వచ్చాయని, అందులో 12 వినతులు 22ఏ సమస్యల పరిష్కారం కోసం , మరో 14 అర్జీలు పట్టాల మార్పు కోసం వచ్చినట్లు వెల్లడించారు. సదస్సుకు రెవెన్యూ అధికారులు మినహా మిగిలిన ఏ విభాగానికి చెందిన వారు హాజరు కాకపోవడం గమనార్హం. కార్యక్రమంలో డీటీ రామచంద్ర, ఆర్ఐ కృష్ణమ్మ పాల్గొన్నారు.

వేడుకగా ఊంజల్‌సేవ



తిరుచ్చిపై ఊరేగుతున్న దేవదేవేరులు

రాపూరు: పెంచలకోన క్షేత్రంలో శనివారం సాయంత్రం శ్రీపెనుశిల లక్ష్మీనరసింహాస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవికి వేడుకగా ఊంజల్ సేవ నిర్వహించారు.ఉత్సవమూర్తులను అలంకార మండపంలో కొలువుదీర్చి కనులపండువగా సేవను జరిపించారు. అనంతరం తిరుచ్చి వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై దేవదేవేరును దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



SUNDAY SPECIAL

- నాడు చదువు నేర్పిన బడిలో.. నేడు గురుతర బాధ్యతలు
- పూర్వ విద్యార్థులే ఉపాధ్యాయులుగా రాణింపు
- పిల్లలను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న టీచర్లు

దొరకునా.. ఇటువంటి సేవ

అక్కడే అక్షరాలు దిద్దారు. విద్యాబుద్ధులు నేర్చుకున్నారు. పాఠ్యాంశాలు ఔపోసన పట్టారు.. ఉన్నతంగా ఎదిగారు. ఉపాధ్యాయులుగా అదే బడిలో కొలువుదీరారు. అదే తరగతి గదిలో పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారు. ఒకప్పుడు చదివిన పాఠశాలలోనే గురుతర బాధ్యతలు నిర్వహిస్తున్నారు. భావి పౌరులను తీర్చిదిద్దుతున్నారు. ఇంతటి మహత్తర అవకాశం పొందిన టీచర్లపై 'సాక్షి' ప్రత్యేక కథనం. - సత్యవేడు/వరదయ్యపాళెం/సైదాపురం/చిల్లకూరు

సంతృప్తిగా ఉంది



బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదివా. ఉన్నత చదువులు పూర్తి చేసుకుని ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొందా. భౌతికశాస్త్రం ఉపాధ్యాయుడిగా పలు పాఠశాలల్లో పనిచేసి 2017లో బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చా. చదువు నేర్పిన పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేయడం సంతృప్తిగా ఉంది.

– మస్తాన్, స్కూల్ అసిస్టెంట్, భౌతికశాస్త్రం, బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాల

ర్యాంకు పొందేలా శిక్షణ



సత్యవేడు ఉన్నత పాఠశాలలో కె.తులసీ రాం అనే విద్యార్థికి పదో తరగతిలో ప్రత్యేక శిక్షణ ఇచ్చి రాష్ట్ర స్థాయిలో ప్రథమ ర్యాంకులో 585 మార్కులు పొందేలా కృషి చేశా. సత్యవేడు పాఠశాలకు రాష్ట్ర స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చాం. 1977–78లో సత్యవేడు పాఠశాల విద్యార్థిగా 10వతగతిలో స్కూల్ టాపర్‌గా నిలిచా. 2002 స్కూల్ అసిస్టెంటుగా ఉపాధ్యాయ వృత్తిని చేపట్టా. 2017లో జిల్లాస్థాయిలో సంకల్పంతో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికై కలెక్టరు చేతుల మీదుగా బహుమతి అందుకున్నా.

– పి.వెంకటేశ్వర్లు, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సత్యవేడు

శక్తివంచన లేకుండా కృషి



పాఠాలు నేర్చుకున్న బడిలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించడం ఆనందంగా ఉంది. పిల్లల విద్యాభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నా. నేను 1989–1991 మధ్య బీఎన్‌కండ్రిగ మండలం కల్లివెట్టులోని ప్రాథమికోన్నత పాఠశాలలో 6, 7 తరగతులు చదివా. ఉన్నత చదువులు శ్రీకాళహస్తిలో పూర్తి చేసుకుని 2000లో సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించా. వివిధ పాఠశాలల్లో 23 సంవత్సరాల పాటు పని చేశా. తర్వాత నేను చదివిన పాఠశాలకు 2023లో స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు ఉపాధ్యాయుడిగా బదిలీపై రావడం మరచిపోలేని అనుభూతి.

– జగన్నాథం, స్కూల్ అసిస్టెంట్, కల్లివెట్టు ఉన్నత పాఠశాల

ఆత్మస్థైర్యం పెంచేలా..



నేను ఎంపీ హెచ్ పీటీ చదివాను. కరాటేలో ఫోర్తు డాన్ బెల్టు పొందా .సత్యవేడు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇస్తున్నా. హిందీ టీచర్‌గా పనిచేస్తూనే కరాటే మాస్టార్‌గా పిల్లల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు కృషి చేస్తున్నా. యోగాసనాలు, వ్యాయామ విద్యలో మెలుకువలు నేర్పిస్తున్నా. కరాటేలో సత్యవేడు విద్యార్థులు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో బంగారుపతకాలు సాధించేలా శిక్షణ ఇచ్చా. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువు, క్రీడల్లో గుర్తింపు పొందడం సంతోషంగా ఉంది.

– ఎంఏ. భాస్కర్, ప్రభుత్వ ఉన్న పాఠశాల, సత్యవేడు

చదివిన చోటే కొలువు



చదివిన బడిలోనే ఉపాధ్యాయుడిగా కొలువు చేయడం ఆనందంగా ఉంది. సొంత గ్రామంలోని పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడం ఎంతో సంతృప్తిగా ఉంది. అప్పట్లో మా బడి పూరిపాకలో ఉండేదివ. ఇప్పుడు నాడు–నేడు పథకం కింద ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా అన్ని హంగులతో తయారైంది. నా దగ్గర చదువుకున్న చాలా మంది పిల్లలు చక్కటి ఉద్యోగాల్లో స్థిర పడ్డారు. వారిని చూస్తుంటే చాలా సంతోషంగా ఉంటుంది. మరో ఏడాదిలో నేను ఉద్యోగ విరమణ పొందుతున్నా. అయినప్పటికీ ఓపిక ఉన్నంత వరకు పిల్లలకు పాఠ్యాంశాలు బోధిస్తూనే ఉంటా.

– కొక్కు వెంకటసుబ్బయ్య, బల్లవోలు, చిల్లకూరు మండలం

చిత్తశుద్ధితో పనిచేస్తున్నా



ఓనమాలు దిద్దిన విద్యాలయంలోనే ఉపాధ్యాయని పని చేయడం మరచిపోలేని అనుభూతి. హిందీ టీచర్‌గా పిల్లలకు పాఠాలు చెబుతుంటే గత జ్ఞాపకాలు గుర్తుకువస్తున్నాయి. విద్యార్థులు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు నా వంతు కృషి చేస్తున్నా. భావి పౌరులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో పనిచేస్తున్నా. నేను చదివిన బడిలో టీచర్‌గా బాధ్యతలు చేపట్టడం చాలా సంతోషంగా ఉంది.

– షేక్ అస్మత్‌బేగం, సైదాపురం ఉన్నత పాఠశాల, సైదాపురం మండలం

ప్రత్యేకంగా క్లాసులు



సత్యవేడు ఉన్నత పాఠశాలలో 1976 నుంచి 1982 వరకు నేను చదివాను. 2008లో ఎంఏ ఇంగ్లీషు, 2008నుంచి సత్యవేడు ఉన్నత పాఠశాల, 2023లో ఇంటర్ కళాశాలలో విధులు నిర్వహిస్తున్నా. ఆదివారాల్లో విద్యార్థులకు ఉచితంగా స్పోకెన్ ఇంగ్లీషుకు ప్రత్యేకంగా క్లాసులు నిర్వహిస్తున్నా. ఇంగ్లీషు రైటింగ్‌లోనూ, స్పీకింగ్‌లోనూ మెలుకువలు నేర్పిస్తున్నా. 10వతరగతి విద్యార్థులు 100 శాతం పాస్ అయ్యేట్లు శిక్షణ ఇస్తున్నా.

– డీవీ రాజు, జూనియర్ కళాశాల, సత్యవేడు.

గొప్ప అనుభూతి



సత్యవేడు ప్రభుత్వ పాఠశాలలో 1986–87లో 10వతరగతి, ఇంటర్ పూర్తి చేసి 2000లో బీఎస్సీ బీఈడీ 1995లో, 2000లో ఎమ్మెస్సీ పూర్తి చేశా. 2007లో ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులందరినీ ఏకం చేసిన పూర్వ విద్యార్థుల సంఘం ఏర్పాటుకు కృషి చేశా. రూ. 7లక్షలతో పాఠశాలకు ప్రహరీ నిర్మాణం, ముఖద్వారానికి ఇనుపగేటు, సైన్సు మెటీరియల్ రూ.70వేలు అందించా. 10వతరగతిలో ప్రథమ ర్యాంకు పొందే విద్యార్థులకు పోత్సాహక బహుమతి అందజేస్తున్నాం. ప్లాటినం జూబ్లీ ఉత్సవాల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నాం. నేను చదివిన బడిలో పనిచేయడం గొప్ప అనుభూతి.

– జి. పాండురంగయ్య, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సత్యవేడు.

నిరంతరం ప్రణాళిక



నేను 1990 నుంచి స్థానిక పాఠశాలలో 10వతరగతి వరకు చదివా. 2005లో ఎంఏ ఇంగ్లీషు చెన్నైలో పూర్తి చేశా. ప్రస్తుతం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యేలా శిక్షణ ఇస్తున్నా. అందుకు అవసరమైన మార్కులు సాధించేలా విద్యార్థులను నిరంతరం ప్రణాళికతో చదివిస్తున్నా. ఇంగ్లిషులో వెనుక బడిన విద్యార్థులకు మరింత శ్రద్ధగా తీర్చిదిద్దుతున్నా. ప్రతి విద్యార్థీ ఇంగ్లిష్ పరీక్షలో ఉత్తీర్ణుడు అయ్యేలా చర్యలు చేపట్టా.

– వైవీఎల్ కుమార్ , ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సత్యవేడు

సంతోషంగా ఉంది



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న మస్తానయ్య

బీఎన్‌కండ్రిగ మండలం కాంపాళెం దళితవాడకు చెందిన నేను.. 6 నుంచి పదో తరగతి వరకు బీఎన్‌కండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుకున్నా. తర్వాత శ్రీకాళహస్తి ఎస్‌పీఏ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశా. పీఈటీ ట్రైనింగ్ పొంది 2001లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా ఉద్యోగం సాధించా. మొదట కుప్పం మండలంలో పనిచేసి 2003లో బదిలీపై బీఎన్‌కండ్రిగలో నేను చదివిన పాఠశాలకే వచ్చా. నేను పాఠాలు నేర్చుకున్న చోటకే పని చేయడం చాలా సంతోషంగా ఉంది.

– ఇరక మస్తానయ్య, పీఈటీ, బీఎన్‌కండ్రిగ ఉన్నత పాఠశాల

ఇది మంచి ప్రభుత్వం.. పేదల పక్షాన నిలుస్తాం.. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తాం.. అంటూ 'కూటమి' పెద్దలు ఊదరగొట్టారు. అయితే సామాజిక పెన్షన్లను మాత్రం ఊచకోత కోస్తున్నారు. ప్రతి నెలా లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేస్తున్నారు. పండుటాకుల బతుకులతో చెలగాటమాడేస్తున్నారు. దివ్యాంగులను దిక్కుతోచని స్థితిలోకి నెట్టేస్తున్నారు. దీనిపై అధికారులను ప్రశ్నిస్తే తమకు ఎలాంటి సంబంధం లేదని ముఖం చాటేస్తున్నారు. విజయవాడలోని డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే జాబితా ఉంటుందని తెగేసి చెప్పేస్తున్నారు.





పింఛన్ పంపిణీ చేస్తున్న దృశ్యం (ఫైల్)

పింఛన్.. తెంచెన్!

- పెన్షన్లకు కోత పెడుతున్న ప్రభుత్వం
- ఇప్పటి వరకు 7,188 మందికి కత్తెర
- తనిఖీల పేరుతో మరో వేటుకు సన్నద్ధం

తిరుపతి అర్బన్: కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్ల సంఖ్య తగ్గిపోతోంది. ప్రతి నెలా పింఛన్లకు కత్తెర వేస్తున్నారు. వచ్చే జనవరిలో పంపిణీ చేసే పెన్షన్లలో కూడా 641 మందికి కోత వేసేశారు. అధికారులను అడిగితే...వారంతా మృతి చెందారని చెబుతున్నారు. అందువల్లే పింఛన్ల సంఖ్య తగ్గిందంటూ సమాధానం ఇస్తున్నారు. జూన్ నుంచి వచ్చే జనవరి వరకు చూస్తే మొత్తం 7,188పెన్షన్లు తగ్గించారు. ఏడు నెలల్లో ఇంత మంది మృతి చెందడం సాధ్యమేనా? అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు. వారి వివరాలు ఇవ్వాలని అధికారులను కోరితే.. విజయవాడ డీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలోనే జాబితా ఉంటుందని చెబుతున్నారు. మరోవైపు నవంబర్ 1వ తేదీ తర్వాత జిల్లాలో వితంతువులైన మహిళలు పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోమని నెల క్రితం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. దరఖాస్తులు చేసుకున్న వారంతా జనవరి నుంచి పెన్షన్ వస్తుందని భావించారు. అయితే వారికి కూడా మొండిచెయ్యే చూపించారు. మరోవైపు నవంబర్ 1కి ముందు వితంతువులైన మహిళలు పింఛన్‌కోసం దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించకపోవడంతో వారంతా మండిపడుతున్నారు.

మంచి ప్రభుత్వం అంటే ఇదేనా..?

కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత పది రోజుల పాటు ఇంటింటికీ వెళ్లి ఇది మంచి ప్రభుత్వం అంటూ ఒక స్టిక్కర్‌ను అతికించిన సంగతి తెలిసిందే. అయితే నవంబర్ 1వ తేదీకి ముందు వితంతువు అయితే వారికి పింఛన్ అవకాశం ఇవ్వకపోవడమేనా మంచి ప్రభుత్వం అంటే అని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఒక్క పథకాన్ని సక్రమంగా అమలు చేయకుండా ఇది మంచి ప్రభుత్వం అంటే ఎలా అంటూ జనం మండిపడుతున్నారు.

వారంతా మృతి చెందారు

"జూన్ నుంచి వచ్చే జనవరి వరకు చూస్తే 7,188 పింఛన్లు తగ్గిన మాట వాస్తవమే. అయితే వారంతా మృతి చెందారు. నవంబర్ 1వ తేదీ తర్వాత వితంతువులు అయిన వారు దరఖాస్తు చేసుకుంటే వారికి వచ్చే ఫిబ్రవరి నుంచి పెన్షన్లు ఇస్తాం. అలాగే జనవరి నుంచి దివ్యాంగుల పెన్షన్లు తనిఖీ చేస్తాం. – శోభనబాబు, పీడీ, డీఆర్‌డీఏ

నెలవారీగా పెన్షన్ల సమాచారం

జూలై	2,69,162
ఆగస్టు	2,67,772
సెప్టెంబర్	2,67,089
అక్టోబర్	2,66,342
నవంబర్	2,65,488
డిసెంబర్	2,64,636
జనవరి	2,63,995

పైలెట్ ప్రాజెక్టుగా..

ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా ఒక్కో జిల్లాలో ఒక్కో గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకుని పింఛన్ల తనిఖీలు నిర్వహించిన సంగతి తెలిసిందే. అందులో జిల్లాలోని రేణిగుంట మండలం సూరప్పకశం గ్రామాన్ని ఎంపిక చేశారు. ఈ నెల 9,10 తేదీల్లో సర్వే చేపట్టి 17 మందిని అనర్హులుగా గుర్తించారు. ఇదే క్రమంలో వచ్చే జనవరిలో దివ్యాంగుల పింఛన్ల తనిఖీ చేపట్టనున్నారు.

దివ్యాంగుల పింఛన్ల తనిఖీ

జనవరి మొదటి వారంలో జిల్లావ్యాప్తంగా దివ్యాంగుల పింఛన్లపై అధికారులు తనిఖీ చేపట్టనున్నారు. జిల్లాలో 2,63,995 మందికి ప్రతి నెలా రూ.112.59 కోట్లు పింఛన్ల కింద చెల్లిస్తున్నారు. ఈ భారాన్ని తగ్గించుకోవడానికి తనిఖీల పేరుతో పింఛన్లు తొలగిస్తారని చర్చ సాగుతోంది. అనర్హులను తొలగిస్తే తప్పులేదని...అయితే అర్హులను కూడా రాజకీయ రంగుపులిమి వేటు వేస్తారనే టెన్షన్ లబ్ధిదారులను వేధిస్తోంది.

ఎన్ఎస్‌యూలో క్రీడామహోత్సవం



జ్యోతిని వెలిగిస్తున్న చంద్రశేఖర్

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో నాలుగురోజుల పాటు నిర్వహించనున్న సౌత్‌జోన్ సంస్కృత విద్యార్థుల క్రీడా మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా సౌత్ ఇండియా క్రీడా భారతి జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ ఖేలో ఇండియా పథకం కింద ఎంపికైన విద్యార్థులకు కేంద్రప్రభుత్వం ప్రతినెల రూ.50వేలు అందిస్తోందన్నారు. వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి మాట్లాడుతూ ఆర్చరీ, చదరంగం, కరస్రాము, మల్లయుద్ధం వంటి క్రీడల్లో విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో డీన్ రజనీకాంత్ శుక్లా, ప్రొఫెసర్ సత్యనారాయణాచార్య, రిజిస్ట్రార్ రమాశ్రీ, పీడీ సేతూరామ్, డాక్టర్ కనపాల కుమార్, డాక్టర్ గిరికుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

3 నుంచి పీజీ పరీక్షలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ పరిధిలో జనవరి 3వ తేదీ నుంచి పీజీ ఫస్ట్ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ మూడే దామ్లానాయక్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీ నుంచి మొదలు కావాల్సిన పరీక్షలను 3వ తేదీకి వాయిదా వేశామని, దీనిపై అన్ని కళాశాలల యాజమాన్యాలకు సమాచారం సైతం అందించినట్లు వెల్లడించారు.

31న పింఛన్ల పంపిణీ

తిరుపతి అర్బన్: జనవరి నెలకు సంబంధించిన ఎన్టీఆర్ సామాజిక భద్రతా పింఛన్లను ఈ నెల 31వ తేదీన పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఒక్కరోజులోనే వందశాతం పింఛన్లు పంపిణీ చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అధికారులను ఆదేశించారు. న్యూఇయర్ నేపథ్యంలో ముందు రోజే ఇస్తున్నట్లు చెప్పారు. ఈ నెలకు జిల్లాలో 2,63,995 మందికి రూ.112.59 కోట్లు పింఛన్ నగదు పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. 31న ఉదయం 6 గంటల నుంచే సిబ్బంది లబ్ధిదారుల ఇంటికి వెళ్లి పంపిణీ చేయాలని స్పష్టం చేశారు.

ఆర్టీసీ స్థలాల పరిశీలన

తిరుపతి అర్బన్ : ఆర్టీసీ కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పైడి చంద్రశేఖర్ శనివారం తిరుపతిలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఆర్టీసీకి చెందిన స్థలాలను పరిశీలించారు. తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌ను ఇంటిగ్రేటెడ్ బస్టాండ్‌గా రూపుదిద్దనున్న క్రమంలో ప్రత్యామ్నాయ ఏర్పాటు కోసం మంగళం డిపో, రేణిగుంట మండలంలోని ఎల్లమండ్యం సమీపంలోని ఆర్టీసీ స్థలాలను సందర్శించారు. సెంట్రల్ బస్టాండ్ పనులు ప్రారంభిస్తే తిరుపతి నగరం నాలుగు వైపులా ప్రత్యామ్నాయ బస్టాండ్లను ఏర్పాటు చేసుకోవడానికి ముందుస్తుగా సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే స్విమ్స్ ఆస్పత్రిలో సమీపంలో ఆర్టీసీ ఉద్యోగుల కోసం నిర్మిస్తున్న ఆస్పత్రిని పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా ప్రజా రవాణా అధికారి జగదీష్ పాల్గొన్నారు.

వెటర్నరీలో 'యూత్ పార్లమెంట్'



విద్యార్థులతో అధికారులు, అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్వీ వెటర్నరీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో యువ మంథన్ యూత్ పార్లమెంట్ అండ్ యూఎన్ఓ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. యువతను దేశాభివృద్ధిలో భాగం చేయాలనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూత్ పార్లమెంట్ ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా దేశ ఆర్థిక వ్యవస్థలో పశువైద్యం, వ్యాధి నివారణ, మౌలిక అవసరాల ప్రాముఖ్యత, గ్లోబలైజేషన్‌లో పశువైద్య పాత్రపై సుదీర్ఘంగా విద్యార్థులు చర్చించారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతిరామయ్య, డాక్టర్ వేణు, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ అమరావతి, డాక్టర్ వెంకటేశ్వర్లు, రాజా పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అడ్మిషన్లకు ఆహ్వానం

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఎగ్జిక్యూటివ్ కోటాకు సంబంధించి పీహెచ్‌డీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ భూపతి నాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆసక్తి గలవారు జనవరి 21వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అడ్మిషన్ కోసం పదేళ్లపాటు ప్రభుత్వ, ప్రైవేటు, పారిశ్రామిక రంగాలలో కార్యనిర్వాహక అధికారిగా అనుభవం, గ్రూప్ వన్ సర్వీస్ హోదాకి సమానమైన సర్వీస్‌తో నెలకు రూ.లక్ష వేతనం ఉండాలని చెప్పారు. ప్రైవేట్, పారిశ్రామిక రంగాల వారైతే రూ.25 కోట్ల పైబడిన లావాదేవీలు కలిగి ఉండాలని వెల్లడించారు. ఈ మేరకు ఆడిట్ రిపోర్ట్ జతపరచాలని పేర్కొన్నారు. రెండేళ్లసాటు ఆదాయ పన్ను శాఖ జమ ఖాతా, రెండు పరిశోధన వ్యాసాలు జత పరచాలని తెలిపారు.

అధికారుల సాక్షిగా..
తమ్ముళ్ల దాష్టీకం!

- పోలీస్, రెవెన్యూ సిబ్బంది సహకారంతో పట్టా భూమిలో రోడ్డు
- అర్ధరాత్రి జేసీబీతో అడ్డుగోలుగా ఫెన్సింగ్ కూల్చివేత
- కోర్టు ఉత్తర్వులను సైతం లెక్క చేయని టీడీపీ నేతలు
- అడ్డువచ్చిన రైతులను చావబాదిన పచ్చ మూక



పట్టాభూమిలో బండిబాట తీసిన దృశ్యం



గేట్లు ధ్వంసం చేయిస్తున్న టీడీపీ నేతలు

భాకరాపేట : అధికారం ఉంది కదా అని ప్రభుత్వ అధికారులు.. పోలీసుల సాక్షిగా తెలుగు తమ్ముళ్లు రెచ్చిపోయారు. రైతులతోపాటు పంట పొలాలపై దాడికి తెగబడ్డారు. అన్నదాతలపై ప్రతాపం చూపారు. పట్టా భూమిలో కాలువ, కాలినడక బాట ఉందంటూ అర్ధరాత్రి పచ్చని చెట్లను నరికివేశారు. పంట పొలాల చుట్టూ ఏర్పాటు ఏర్పాటుచేసిన కంచెను జేసీబీలతో పెకలించేశారు. పట్టా భూమిలో దౌర్జన్యం చేస్తున్న వారికి కోర్టు ఉత్తర్వులు చూపించేందుకు వచ్చిన రైతులపై దాడి చేశారు. సాక్షాత్తు ప్రభుత్వ అధికారుల సమక్షంలో ఓ రైతుకు చెందిన పట్టా భూమిలో టీడీపీ నేతలు దౌర్జన్యంగా రోడ్డు ఏర్పాటు చేశారు. కళ్లముందు రైతులపై టీడీపీ నేతలు దాడి చేస్తున్నా పోలీసులు చూస్తుండిపోయారు. ఇదంతా ఎక్కడో కాదు ముఖ్యమంత్రి స్వగ్రామం ఉన్న చంద్రగిరి నియోజకవర్గంలో చోటుచేసుకుంది. చిన్నగొట్టిగల్లు మండలం దిగవూరు రెవెన్యూ గ్రామం మట్లువారిపల్లెలో శుక్రవారం రాత్రి జరిగింది. బాధితులు, స్థానికుల వివరాల మేరకు.. దిగవూరు రెవెన్యూ లెక్క దాఖలు 182, 183 సర్వే నంబర్లలో విశ్రాంత అధ్యాపకుడు దొడ్డిపల్లి రాజారెడ్డికి దాదాపు 12.5 ఎకరాల వారసత్వ ఆస్తి ఉంది. ఈ భూమికి ఆనుకుని ఉన్న కాలినడక వదలివేసి కంచె వేసుకున్నానని రాజారెడ్డి చెబుతున్నారు. తమకు చెందిన భూమిలో ఎక్కడ కూడా ప్రభుత్వ భూమి లేదని, పొలంలో వర్షపు నీరు వెళ్లడానికి చిన్న కాలువ తీసుకుంటే అదే కాలువను బండిబాటగా వేయాలని టీడీపీ నాయకులు వచ్చి తనను, తన సోదరుడు సుధాకర్‌రెడ్డిని చితకబాదినట్లు రాజారెడ్డి తెలిపారు. సుధాకర్‌రెడ్డి సెల్‌ఫోన్ ధ్వంసం చేశారని తెలిపారు. ఇదంతా భాకరాపేట ఎస్ఐ, పోలీసుల సమక్షంలోనే జరుగుతున్నా.. వారు ఏమాత్రం పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తన పొలానికి వేసుకున్న రెండు గేట్లు తొలగించి, వారికి ఇష్టం వచ్చినట్లు ఎక్కడబడితే అక్కడ కంచెను తొలగించి దారి ఏర్పాటు చేసుకున్నారన్నారు. రెవెన్యూ, పోలీసు అధికారులకు మొరపెట్టుకున్నా తమ గోడు కూడా వినలేదని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తన పొలం తనకు అప్పగించి న్యాయం చేయాలని విన్నవించారు.

పట్టా కోసం పోరాటం



పట్టా ఇవ్వాలంటూ ఆందోళన చేస్తున్న గిరిజనులు

దొరవారిసత్రం : సుమారు 50 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమికి పట్టాలు ఇప్పించాలని 28 కుటుంబాలకు చెందిన గిరిజనులు కోరారు. శనివారం ఈ మేరకు తనియాలి గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన రెవెన్యూ సదస్సులో అధికారులకు విన్నవించారు. 1976లో సర్వే నంబర్ 1లోని 50 ఎకరాలకు సీజేఎఫ్ఎస్ పట్టాలు ఇచ్చారని, అప్పటి నుంచి సదరు భూములను సాగు చేసుకుంటున్నామని వెల్లడించారు. ఇదే సర్వేనంబర్‌లో అగ్రకులాలకు చెందిన వారు సాగు చేసుకుంటున్న భూమికి పాసు పుస్తకాలు ఇచ్చారని, తమకు మాత్రం కంచి పోరంబోకు అంటూ అధికారులు సాకులు చెబుతున్నారని ఆరోపించారు. దీనిపై రెవెన్యూ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా, ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. యాభై ఏళ్లుగా సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఎందుకు ఇవ్వరంటూ రెవెన్యూ అధికారులను ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించకుంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.

పెద్దలకే మద్దతు!

తనియాలి రెవెన్యూ గ్రూపు పరిధిలోని సర్వే నంబరు 1లో 240 సబ్ డివిజన్లగా అప్పటిలోనే చేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు సాగు భూమి కింద 200 మందికి పైబడి మంజూరు చేశారు. వీరిలో అర్థ బలం, అంగబలం ఉన్నవారికి మాత్రం 20ఏళ్ల క్రితమే రెవెన్యూ అధికారులు పట్టాలు ఇచ్చేశారు. అయితే ఎస్టీలకు పట్టాలు ఇచ్చేందుకు మాత్రం అధికారులు ససేమిరా అంటున్నారు.

కంచి పోరంబోకు అంటున్నారు



యాభై ఏళ్లుగా సాగు చేస్తున్న 1.65 ఎకరాలకు పట్టా ఇవ్వమని కొన్నేళ్లు తిరుగుతుంటే కంచి పోరంబోకు అంటూ రెవెన్యూ అధికారులు తప్పుకుంటున్నారు. సాగులో ఉన్న భూమికి ఎలాంటి ఆధారం లేకపోవడంతో ప్రభుత్వం నుంచి వచ్చే పథకాలు అందడం లేదు. ఇదే సర్వే నంబరులో పలువురికి పట్టాలు ఇచ్చారు. వారికి మాత్రం నిబంధనలు వర్తించలేదు.

– వెలుగు మునస్వామి, తనియాలి ఎస్టీ కాలనీ

తిరుగుతూనే ఉన్నాం



మా ఆధీనంలో ఉన్న ఎకరా భూమికి పట్టా ఇవ్వాలంటూ కొన్నేళ్లుగా తిరుతూనే ఉన్నాం. ఎక్కడ సదస్సులు జరిగినా అర్జీలు ఇచ్చాం. ప్రజాప్రతినిధుల నుంచి రెవెన్యూ అధికారుల వరకు మా సమస్యను పట్టించుకునే వారే లేకుండాపోయారు. మా సాగులో ఉన్న భూమికి పట్టా వస్తుందో లేదో కూడా తెలియని పరిస్థితిలో ఉన్నాం.

– కోట్లాపాటి పోలమ్మ, తనియాలి ఎస్టీ కాలనీ

కువైట్ చెరలోని మహిళకు విముక్తి



యల్లంపల్లి లక్ష్మి

శ్రీకాళహస్తి: కువైట్‌లో పనిచేసేందుకు వెళ్లి, ఆరోగ్యం దెబ్బతినడంతోపాటు యజమాని ఇబ్బంది పెడుతున్నాడని సోషల్ మీడియా వేదికగా అభ్యర్థించిన మహిళ ఎట్టకేలకు ఎస్పీ చొరవతో ఇంటికి చేరుకుంది. శ్రీకాళహస్తి పట్టణం రాజీవ్‌నగర్‌కు చెందిన యల్లంపల్లి లక్ష్మి అనే మహిళ పీలేరుకు చెందిన ఓ ఏజెంట్ ద్వారా దుబాయికి వెళ్లి అక్కడ రెండేళ్లలో పనికి కుదిరింది. అయితే యజమాని తనను ఇబ్బంది పెడుతున్నాడని, తిండిపెట్టడంలేదని ఈ నెల 21న సోషల్‌మీడియా వేదికగా లక్ష్మి ఓ వీడియో విడుదల చేసింది. స్వదేశానికి వెళ్లిపోతానని యజమానిని కోరితే బెదిరిస్తున్నాడని ఆరోపించింది. ఈ నేపథ్యంలో బాధితురాలి కుమార్తె సుచిత్ర దీనిపై ఎస్పీ సుబ్బరాయుడును కలిసి విన్నవించింది. వెంటనే ఆయన స్పందించి పీలేరుకు చెందిన ఏజెంట్ శ్రీనివాస్‌తో మాట్లాడారు. అలాగే దుబాయిలో ఉన్న తిరుపతికి చెందిన ఏపీఎస్ఆర్టీ మాజీ కో–ఆర్డినేటర్ డాక్టర్ ముక్కు తులసీరామ్‌ను ఫోన్‌లో సంప్రదించారు. బాధితురాలిని తిరుపతికి తీసుకువచ్చేందుకు సహకరించాలని కోరారు. అలాగే స్పెషల్‌బ్రాంచ్ డీఎస్పీ గిరిధర్‌కు ఆదేశాలు ఇచ్చి ప్రత్యేకంగా కేసు నమోదు చేసి పర్యవేక్షించాలని సూచించారు. ఈ మేరకు ఏజెంట్ ద్వారా బాధిత మహిళను శనివారం శ్రీకాళహస్తికి తీసుకువచ్చారు.

విద్యుత్ బిల్లుల నగదుతో ఉడాయింపు

కోట : విద్యుత్ బిల్లుల నగదుతో జేఎల్ఎం పరారైన సంఘటన కోటలో వెలుగులోకి వచ్చింది. దీనిపై అధికారులకు వినియోగదారులు ఫిర్యాదు చేశారు. వివరాల మేరకు..కోట–1 సచివాలయంలో జేఎల్ఎంగా పనిచేస్తున్న చంద్ర వారం నుంచి విధులకు హాజరు కావడం లేదు.ఈ నెలలో పలువురు వినియోగదారుల నుంచి బిల్లులు వసూలు చేసిన నగదుతో పరారైనట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఏఈ తేజకృష్ణ రెండు రోజుల క్రితం జేఎల్ఎంపై కోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా, విద్యుత్ బిల్లులు చెల్లించని వారి కనెక్షన్లు తొలగించేందుకు సిబ్బంది శనివారం వినియోగదారుల ఇళ్ల వద్దకు వెళ్లగా మేం జేఎల్ఎం చంద్రకు చెల్లించామని వాదనకు దిగారు. దీంతో విషయం వెలుగులోకి వచ్చింది. జేఎల్ఎం చంద్ర పరిధిలో 150 వరకు కనెక్షన్లు ఉండగా సుమారు రూ.4లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. పలువురు వ్యాపారులు కూడ అధిక మొత్తంలో జేఎల్ఎంకు ఇచ్చినట్లు తెలుస్తోంది. ఏడీ చిన్నయ్యను వివరణ కోరగా విద్యుత్ బిల్లులను కార్యాలయంలో లేదా ఆన్‌లైన్ పేమెంట్ ద్వారా చెల్లించాలని సూచించారు. విద్యుత్‌శాఖ ఏఈ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పవన్‌కుమార్ తెలిపారు.

కంటైనర్ బోల్తా



చంద్రగిరి : పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారిపై నడింపల్లి వద్ద శనివారం ఓ కంటైనర్ బోల్తా పడింది. వివరాలు.. శివకాశి నుంచి పాట్నాకు టపాకాయల లోడుతో వెళుతున్న కంటైనర్ అదుపు తప్పి బోల్తా పడి సర్వీసు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో డ్రైవరు కిరణ్ కుమార్ సురక్షితంగా బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని, ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. అనంతరం కంటైనర్‌లోని టపాకాయలను మరో వాహనంలో తరలించారు. ఈ మేరకు కేసు నమోదు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్స్‌లో 'చైర్ ఒరేషన్'



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి తుడా : స్విమ్స్ సర్జికల్ అంకాలజీ విభాగం ఆధ్వర్యంలో శనివారం పద్మావతి అడిటోరియం వాట్ ఈజ్ న్యూ ఇన్ సర్జికల్ ఆంకాలజీ అనే అంశంపై 6వ వార్షిక చైర్ ఒరేషన్ కార్యక్రమం నిర్వహించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్వీ కుమార్, హైదరాబాద్ బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ మెడికల్ డైరెక్టర్ టి సుబ్రమణ్యేశ్వరరావు ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా సర్జికల్ అంకాలజీ చికిత్సలో వస్తున్న మార్పులు, నూతన టెక్నాలజీని వివరించారు. కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అల్లాడి మోహన్, రిజిస్ట్రార్ డాక్టర్ అపర్ణ ఆర్ బిట్లా, శ్రీ పద్మావతి మహిళా వైద్యకళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఉషాకళావత్, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ వనజాక్షమ్మ, సర్జికల్ ఆంకాలజీ విభాగాధిపతి డాక్టర్ నరేంద్ర, రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ సుబ్రమణియన్, ఫిజియోథెరపీ ప్రిన్సిపల్ డాక్టర్ మాధవి పాల్గొన్నారు.

పక్షుల పండుగకు పకడ్బందీ ఏర్పాట్లు



పార్కింగ్ స్థలం పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్

దొరవారిసత్రం : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న పక్షుల పండుగకు నేలపట్టులో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్ తెలిపారు శనివారం వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పక్షుల కేంద్రం సందర్శించారు. వ్యూ పాయింట్లు, చెరువు కట్ట, పక్షుల కేంద్రం మార్గంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. సందర్శకులు ఇబ్బంది పడకుండా అధిక సంఖ్యలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని కోరారు. వాహనాల పార్కింగ్ స్థలం కూడా విశాలంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో గూడూరు మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీఓ గోవర్ధన, ఎఫ్ఆర్ఓ సౌజన్య, వివిధ శాఖల అధికారులు మోహన్‌రావు, జ్యోతిర్మయి, ఉమామహేశ్వరి, బాలయ్య పాల్గొన్నారు.

ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి



నమూనాలను పరిశీలిస్తున్న డీఈఓ

తిరుపతి ఎడ్యుకేషన్ : సరికొత్త ఆవిష్కరణలతోనే దేశాభివృద్ధి సాధ్యమని డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. మంగళం ట్రెండ్స్ జెడ్పీ హైస్కూల్‌లో శనివారం స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్నివాల్ పేరిట సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఇందులో 14పాఠశాలల నుంచి దాదాపు 20కిపైగా సైన్స్ నమూనాలను ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులు శాస్త్ర, సాంకేతిక రంగాలవైపు అడుగులు వేసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థుల్లోని మేధోశక్తి, సృజనాత్మకత వెలికితీసేందుకు ఇలాంటి కార్నివాల్స్ దోహదపడతాయని వెల్లడించారు. అనంతరం విద్యార్థుల సైన్స్ నమూనాలను పరిశీలించి సర్టిఫికెట్లు అందజేశారు. తిరుపతి డీవైఈఓ కె.బాలాజీ, జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్, స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎం.కిషోర్, విజయ్‌సారథి పాల్గొన్నారు.

సామాన్య భక్తులకే ప్రాధాన్యం



డయల్ యువర్ ఈఓలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ శ్యామలరావు

తిరుమల: వైకుంఠ ఏకాదశిరోజు నుంచి పదిరోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనానికి అనుమతిస్తున్న నేపథ్యంలో సామాన్య భక్తులకే ప్రాధాన్యమిస్తున్నట్లు టీటీడీ ఈఓ శ్యామల రావు తెలిపారు. డయల్ యువర్ ఈవో కార్యక్రమంలో భాగంగా శనివారం తిరుమలలోని అన్నమయ్య భవన్ నుంచి ఆయన పలువురు భక్తులతో నేరుగా మాట్లాడారు.

- వైకుంఠ ద్వార దర్శనం కోసం టైంస్లాట్ టోకెన్లు జారీచేస్తాం.
- ఆన్‌లైన్‌లో దర్శనం టికెట్లు బుక్ చేసుకున్న దాతలకు రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శన క్యూ ద్వారా దర్శనానికి అనుమతిస్తాం.
- సామాన్య భక్తుల సౌకర్యార్థం జనవరి 8 నుంచి 11వ తేదీ వరకు దాతలకు గదుల కేటాయింపు ఉండదు.
- తిరుపతిలోని 8 కేంద్రాల్లో 87 కౌంటర్లు, తిరుమలలో 4 కౌంటర్లు కలుపుకుని మొత్తం 91 కౌంటర్ల ద్వారా సర్వదర్శనం టోకెన్లు జారీ చేస్తాం.
- జనవరి 10, 11, 12 తేదీలకు సంబంధించి జనవరి 9వ తేదీన ఉదయం 5 గంటల నుంచి 1.20 లక్షల టోకెన్లు అందిస్తాం.
- తర్వాత రోజులకు ఎప్పటికప్పుడు భూదేవి కాంప్లెక్స్, శ్రీనివాసం, విష్ణు నివాసంలలో టోకెన్లు జారీ చేస్తాం.
- భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో ఇందిరా మైదానం, రామచంద్ర పుష్కరిణి, శ్రీనివాసం కాంప్లెక్స్, విష్ణునివాసం కాంప్లెక్స్, భూదేవి కాంప్లెక్స్, భైరాగిపట్టెడలోని రామానాయుడు ఉన్నత పాఠశాల, ఎంఆర్ పల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జీవకోనలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, తిరుమల బాలాజీ నగర్ కమ్యూనిటీ హాల్‌లో టోకెన్ కౌంటర్లు ఏర్పాటు చేశాం.
- సర్వదర్శనం టోకెన్ల కలిగిన భక్తులు తమకు కేటాయించిన సమయానికే తిరుమలకు వచ్చి స్వామివారి దర్శించుకోవాలి.
- చంటిపిల్లల తల్లిదండ్రులతో పాటు వృద్ధులు, దివ్యాంగులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బంది తదితరుల ప్రత్యేక దర్శనాలను ఈ పది రోజులపాటు రద్దు చేశాం.
- వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించం. ప్రోటోకాల్ పరిధిలోని ప్రముఖులు స్వయంగా వస్తే మాత్రం శ్రీవారి దర్శనం కల్పిస్తాం.

శాంతిభద్రతల రక్షణే లక్ష్యం



మాట్లాడుతున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్ : శాంతిభద్రతల రక్షణే లక్ష్యంగా పోలీసులు విధులు నిర్వర్తించాలని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. శనివారం శ్రీపద్మావతి వర్సిటీలోని సావేరి సమావేశ మందిరంలో నెలవారీ నేర సమీక్ష నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అంకితభావంతోనే పనిచేస్తేనే ప్రజల మనసులో నిలిచిపోతామని వెల్లడించారు. ప్రాపర్టీ కేసులకు సంబంధించి పురోగతి సాధించాలని స్పష్టం చేశారు. ప్రతి పోలీస్ అధికారి తమ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో సభలు ఏర్పాటు చేయాలని కోరారు. యువతతో ముఖాముఖీ మాట్లాడి సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సంక్రాంతి పండుగ నేపథ్యంలో జూదం, మట్కా, కోడి పందేలు, డీజే సాంగ్స్, రికార్డింగ్ డాన్స్‌లను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని చెప్పారు. చట్ట విరుద్ధంగా వ్యవహరించే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలు, వాణిజ్య సముదాయాలు, రద్దీ ఎక్కువగా ఉండే చోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని తెలిపారు. స్పెషల్ డ్రైవ్ చేపట్టి డ్రైవింగ్ లైసెన్స్ లేని వారు, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్, మైనర్ డ్రైవింగ్‌లపై చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. సమావేశంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచారి, నాగభూషణరావు, గిరిధర్ పాల్గొన్నారు.